# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

NOVEMBER - 2003

## సత్యవాణి - టి.వి. స్పందన

"దైవజనులు జాషువాగార్కి క్రీస్తు ప్రభువు పరిశుద్ధ నామములో శుభములు. దేవుడు తన పరిచర్యలో మిమ్మును అత్యధికముగా వాడు కొనుచున్న విధానమును బట్టి వందనములు. రేడియో ప్రసారంలోనే గాక టి.వి. ప్రసంగీకునిగా మిమ్మును తన కృప చొప్పున ఆశీర్వదించి యున్న విషయములో దేవునికి కృతజ్ఞతస్తుతులు చెల్లిస్తు వున్నాము. "సువార్త ప్రసంగములు" తప్పక పంపండి. దేవుడు మిమ్మును పోషించి సంరక్షించునుగాక, ఆమేన్"

*- డి. విజయ భాస్కరబాబు, ధోన్, కర్నూలు జిల్లా.*

"అయ్యా జాషువాగూటం గారికి మా యొక్క హృదయ పూర్వక వందనములు. అయ్యా తేజ టి.వి.లో వచ్చే మీ ప్రసంగం, దైవ సందేశం తప్పకుండా చూస్తున్నాము. మీరు అబద్ధ ప్రవక్తలకు భయం కలిగించే లాగున ప్రసంగం చేస్తారు . మీరు దేవుని సేవలో ఇంకాబలంగా వాడబడాలని మా ప్రార్థన".

*- 3. శ్రీనివాస్, తాళ్లపలి. అదిలాబాద్.*

"అయ్యా, మీరు పంపించే సత్యవాక్కు పత్రిక సేవ ఒకవంతు అయితే మీ టి.వి. ప్రోగ్రామ్ చూచిన వారిలో ఎక్కువ స్పందన వస్తుంది. చాల సంతోషం. మీరు టి.వి.లో అడుగు పెడితే దేవుని వాక్యం మానవుని హృదయంలో దూసుకుంటుంది".

*- పి. శాంతయ్య, కంబంపాలెం, గుంటూరు జిల్లా.*

"జాషువా గూటం గారికి వందనములు. ఏ టి.వి, రేడియో కార్యక్రమాలలో వాడని మంచి తెలుగు పదజాలమును మీరు 'సత్యవాణి' లో ప్రయోగించుచున్నందుకు మేమెంతగానో సంతోషించడమేగాక, గర్వపడుచున్నాము. 'దరిమిల' వగయిరా' వంటి పదాలను మీ ప్రసంగాలలో విని భాషాభిమానులు మురిసి పోతారు.

*- షాలేమురాజు, చీపురుపల్లి, విజయనగరం.*

"బ్రదర్ జాషువా గూటం గారికి, శనివారం మీరు తేజ ఛానల్‌లో అందించు ఆత్మీయహారము మాకెంతగానో తృప్తి పరచుచున్నది. మేము ఇదివరకు విగ్రహారాధికులము. మీరు చెప్పిన విధముగా వాక్యాను సారముగా నమ్మి బాప్తిస్మము పొందాము. మా కొరకు ప్రార్థించండి".

*- టి. వరలక్ష్మి, అనంతపురం.*

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — నవంబర్ 2003 — సంచిక 4


## సత్యవాక్యమును సరిగ విభజించుట

(Rightly dividing the Word of Truth)

అపొస్తలుడైన పౌలు తిమోతి యను ఒక యౌవన క్రైస్తవునికి వ్రాయుచు, "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గు పడనక్కరలేని పనివానిగాను, సత్య వాక్యమును సరిగ విభజించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని హెచ్చరించెను (2 తిమో 2:15). సత్యవాక్యము అనగా దేవుని వాక్యము; అది బైబిలు గ్రంధము (యోహాను 17:17). దానిని సరిగ విభజించి ఉపదేశించిన యెడల అది పరలోక మార్గమును సూటిక సూచించును. దానిని సరిగ విభజించలేని యెడల అందున్న సత్యము మార్చి వేయబడగలదు. దేవుని యెదుట యోగ్యులముగా ఎంచబడవలెనంటే, సత్యవాక్యమును మనము సరిగ విభజిస్తూ ఉపదేశించవలెను.

బైబిలు గ్రంధమును మనము జాగ్రత్తగ పఠించిన యెడల, మానవ చరిత్ర అంతయు అందు మూడు యుగములుగా విభజింపబడియున్నది. వాటిని

మనము పితరుల యుగము లేక గోత్రకర్తల యుగము (Patriarchal Age), యూదుల యుగము (Jewish Age), క్రైస్తవ యుగము (Christian Age) అని పిలువవచ్చును. ఈ ప్రతి యుగములోను దేవుడు తన చిత్తమును మనుష్యులకు తెలియపరచుచు వచ్చెను. అయితే దేవుడు మొదటి యుగములో మనుష్యుల నేమి ఆజ్ఞాపించెనో దానిని రెండవ యుగములోని గాని, మూడవ యుగములోగాని ఆజ్ఞాపించలేదు. ఇంకొక మాటలో ఈ మూడు కాలము లలోను ఆయన బయలుపరచిన తన చిత్తము ఒక్కటే కాదు. రాబోవు కొద్ది పాఠముల లోను దేవుడు ఈ మూడు యుగములలో తన ప్రజలతో ఎట్లు సంప్రదించెనో తెలుసుకొందము. ఈ రోజు బైబిలు నందలి మొదటి యుగమును గూర్చి అనగా గోత్రకర్తల యుగమును గూర్చి కొంత తెలుసు కొందము.

## గోత్రకర్తల యుగము

బైబిలునందలి మొదటి యుగములో దేవుడు వేర్వేరు కుటుంబ యజమానుల ద్వారా తన చిత్తమును బయలుపరచుచు పరిపాలించెను. వేర్వేరు గోత్ర కర్తలకు ఆయన తన చిత్తమును ఆ యుగములో బయలు పరచుచు వచ్చెను. గనుక ఆ మొదటి యుగమును గోత్రకర్తల యుగమని మనము చెప్పుకొను చున్నాము. ఆ యుగము సృష్టి జరిగిన నాటినుండి ఆరంభమై మోషేవద్ద అంతమగు చున్నది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి మోషే ద్వారా విడుదల పొందినపుడా యుగము అంతమగు చున్నది. అది ఆదికాండము మొదటి అధ్యాయములో ఆరంభమై నిర్గమ 20వ అధ్యాయములో 2500 సంవత్సరముల తరువాత మోషేతో అంతమగుచున్నది. ఈ యుగములో ప్రతి కుటుంబ యజమానిని దేవుడు ఒక యాజకునిగా వినియో గించినట్లు మనము చూడ గలము. దేవుడు ఒక గోత్రకర్తకు ఒక ఆజ్ఞను, వేరొకనికి వేరొక ఆజ్ఞను ఆజ్ఞాపించుచు వచ్చెను. అంటే కాలము గడచిన కొలది వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు ఆజ్ఞలను ఆయన ఆజ్ఞా పించుచు వచ్చెను. ఇప్పుడు కొన్ని ఉదాహరణలను చూచుకొనుచు ఈ అంశమును గ్రహించు కొందాము.

దేవుడు ఆదాము హవ్వలను ఏదేను వనములో ఉంచుచు, "ఈ తోటలో నున్న ప్రతి వృక్షఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును!

అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తినుదినమున నిశ్చయముగా చచ్చెద వని" ఆజ్ఞాపించెను (ఆది 2:16, 17). ఆదాము హవ్వలు ఆ చెట్టు యొక్క ఫలములను తినిరి. తదనంతరము ఏమి జరిగెనో మనమందరము బాగుగా ఎరుగుదుము (ఆది 3:1-24). <u>ఇప్పుడొక ప్రశ్న:</u> ఆదాము, హవ్వలను తప్ప మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు తినకూడదు అని దేవుడు ఇంకెవరికైనా ఆజ్ఞాపించెనా? ఆజ్ఞాపించలేదు గదా.

ఆదాము తరువాత నోవహుయను కుటుంబ యజమాని మనకు బైబిలు నందు కన్పించుచున్నాడు. జలప్రళయము నుండి తప్పించుకొను నిమిత్తము నోవహు ఒక ఓడను నిర్మించవలెనని దేవుడు అతని నాజ్ఞాపించెను (ఆది 6:14-16). అప్పటి కింకను భూమిమీద ఎన్నడు వర్షము కురువనేలేదు (ఆది 2:5,6). అయితే "నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయముల యొక్క తలంపులోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి, తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చు కొనెను" (ఆది 6:5,6). అందువలన నరులను, నరులతో కూడ జంతువులను భూమి మీద నుండకుండ తుడిచి వేయుదునని దేవుడు నిశ్చయించు కొనెను (6:7). సమస్త శరీరులను భూమిమీద నుండకుండ గొప్ప జలప్రళయము ద్వారా నాశనము చేయ బోవు చున్నానని దేవుడు చెప్పిన మాటపై ఆధారపడి దేవుడు ఆజ్ఞాపించిన రీతిగా నోవహు ఒక ఓడను నిర్మించెను. అంతకుమున్నెన్నడు భూమిపై వర్షము కురియకపోయినను దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము నోవహు యావత్తు చేసెను (6:22). దేవుని ఆజ్ఞలకు నోవహు చూపించిన విధేయత వలన కలిగిన ప్రతిఫలమును మీరు ఆదికాండము 7, 8 అధ్యాయములలో చదువవచ్చును. <u>ఇప్పుడొక ప్రశ్న:</u> నోవహు తప్ప అట్టి ఓడను నిర్మించ వలసినదని దేవుడు ఇంకెవరినైనా ఆజ్ఞాపించెనా? ఆజ్ఞాపించలేదుగదా.

నోవహు తరువాత దేవుడు అబ్రాహామును పిలిచి నీకు ఒక్కడైయున్న నీ కుమారుని అనగా నీవు ప్రేమించు ఇస్సాకును తీసుకొని వెళ్ళి దహనబలిగా అర్పించుమని ఆజ్ఞాపించెను. (ఆది 22:1-2). అబ్రాహాము యొక్క విశ్వాసమును పరీక్షించుట

కొరకు దేవుడట్లు ఆజ్ఞాపించెను. దేవుడెట్లు చేయుమని కోరెనో అట్లే జరిగించుటకు అబ్రాహాము పూనుకొనెను. చివరి గడియ వరకు దేవుడు అబ్రాహామును పరీక్షించి, ఇస్సాకుకు బదులుగా ఒక పొట్టేలును దయచేసెను. దేవుడు అబ్రాహాము యొక్క విశ్వాసమునకు సంతోషించి అతనిని దీవించెను. "నీవు నీకు ఒక్కడే అయ్యున్న నీ కుమారుని ఇయ్య వెను తీయక యీ కార్యము చేసినందున నేను నిన్ను ఆశీర్వదించి ఆకాశ నక్షత్రముల వలెను, సముద్ర తీరమందలి యిసుక వలెను నీ సంతానమును విస్తరింపజేసెదను" అని యెహోవా అతని దీవించెను (ఆది 22:16-17). <u>ఇప్పుడొక ప్రశ్న</u>: అబ్రహామును తప్ప నీ కుమారుని దహనబలిగా అర్పించుమని దేవుడు వేరొకని నెవనినైనా ఆజ్ఞాపించెనా? ఆజ్ఞాపించలేదు గదా.

అబ్రాహాము తరువాత దేవుడు ఇస్సాకుతో మాటలాడెను. ఇస్సాకు తరువాత యాకోబుతో ఆయన మాటలాడెను. యాకోబు పేరును ఆయన ఇశ్రాయేలుగా మార్చెను. అబ్రహాముకు చేసిన వాగ్దానమును దేవుడు ఇస్సాకుతో యాకోబుతోను చేసెను : యాకోబు తరువాత దేవుడు యోసేపును ఏర్పరచు కొనెను. రాబోవుచున్న కరువు నుండి ఇశ్రాయేలు సంతతిని [illegible]ంచు నిమిత్తము దేవుడు యో[illegible]ను ముందు గానే ఐగుప్తుకు పంపించెను. దేవుడు యోసేపుకు తోడై యుండెను. అతని యెడల ఐగుప్తు రాజగు ఫరో రాజుకు మంచి హృదయమ[illegible] కలిగించి చివరకు యోసేపును ఐ[illegible] దేశ మంతటిమీద అధిపతిగా నియమించెను (ఆది 41:40-44). అందు వలన యాకోబును, అతని సంతతి వారును ఐగుప్తునకు తరలి వెళ్ళిరి (ఆది 45, 46). యోసేపు తన 110వ యేట మరణించెను (ఆది 50:24-26). అప్పుడు యోసేపును ఎరుగని కొత్తరాజు ఐగుప్తును ఏల నారంభించెను (నిర్గ 1:8). అతడు ఇశ్రాయేలీయులను బానిసలుగా చేసి, వారిని శ్రమ పెట్టుటకు వెట్టిపనులు చేయించు అధికారులను వారిమీద నియమించెను. వారు ఇశ్రాయేలీయులచేత చేయించు కొనిన ప్రతి పనియు కఠినముగా నుండెను. అయితే ఇశ్రాయేలీయులను బానిసత్వము నుండి విడిపించు నిమిత్తము దేవుడు మోషేను ఏర్పరచు కొనెను. మోషే ద్వారా దేవుడు అనేక గొప్ప క్రియలను ఐగుప్తు దేశములో జరిగించెను (నిర్గమ 3:11). చివరిగా మోషే నాయకత్వమున దేవుడు ఇశ్రాయేలీయులకు విమోచన మను గ్రహించెను.

ఇశ్రాయేలీయులను మోషే ఐగుప్తు నుండి విడుదల చేసి, ఎఱ్ఱ సముద్రము గుండా వారిని రప్పించి సీనాయి కొండవద్దకు చేర్చెను. అప్పుడు దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కొరకు ధర్మశాస్త్రము నిచ్చెను. ఇశ్రాయేలీయులను ఒక కుటుంబముగా కాదుగాని, ఒక జనాంగముగా దేవుడు వారిని పరి గణించెను. అప్పటి నుండి ఒక మధ్యవర్తి ద్వారా దేవుడు తన చిత్తమును వారికి బయలు పరచుటకు ప్రారంభించెను. అందువలన పితరుల యుగము అంతటితో అంతమయ్యి యూదుల యుగము లేదా మోషే యుగము ఆరంభమాయెను.

బైబిలు నందలి మొదటియుగమును అనగా గోత్రకర్తల యుగమును మనము ఇంతవరకు పరిశీలించితిమి. ఆదాము నుండి మోషే వరకు నున్న వేర్వేరు కుటుంబ యజమానులకు దేవుడు తన చిత్తము నెట్లు బయలుపరచుచూ వచ్చెనో మనము తెలుసుకొన్నాము. అంతేకాదు దేవుడు ఒకని కాజ్ఞాపించిన సంగతిని వేరొకని కాజ్ఞాపించలేనట్లు కూడా మనము చూచాము. చివరకు ఇశ్రాయేలు సంతతిని ఒక జనాంగముగా పరిగణించి వారికి మోషే ధర్మశాస్త్రము నిచ్చుటద్వారా దేవుడు గోత్రకర్తల కాలమున కంతమొనర్చి వేరొక యుగమును ప్రవేశ పెట్టినట్లు గమనించుదము. బైబిలు నందలి రెండవ యుగమును గూర్చి వచ్చే సంచికలో తెలుసు కొందాము. దేవుని గ్రంధమయిన బైబిలును మనము సరిగ అర్ధము చేసు కొనుటకు దేవుడు తన చిత్తమును కాలము గడచుకొలదీ తన ప్రజలకు ఎట్లు బయలుపరచుచూ వచ్చెనో గ్రహించుట అతి ప్రాముఖ్యము. గనుక, మీ మిత్రులు కూడ ఈ సందేశములను చదువునట్లు వారిని ప్రోత్సహించండి.

★ ★ ★

క్రీస్తు సంఘములు సమర్పించు "సత్యవాణి" టి.వి. కార్యక్రమమును ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00 వరకు తేజ ఛానల్‌లో చూడండి.
మీ బంధుమిత్రులతో కలిసి సువార్తను వినండి.

ఉపమాన మాలిక :

# పెద్ద కుమారుడు

(The Elder Son)

<u>*లూకా 15 : 25-32*</u>

తప్పిపోయిన కుమారుని గూర్చి క్లుప్తముగా గత కార్యక్రమములో నేర్చు కొన్నాము. యేసు ప్రభువు పాపులను చేర్చుకొని వారితో కూడా భోజనము చేయు చున్నాడని పరిసయ్యులు శాస్త్రులు సణుగుకొన్నారు. వారి నిమిత్తమై యేసు ఈ ఉపమానాన్ని చెప్పారు. యిది నిజానికి తప్పిపోయిన ఇద్దరు కుమారు లను గూర్చిన కధ. చిన్నవాడే పాపము చేసి తండ్రి నుండి దూరమై పోయాడని మనం అనుకొంటాము. గాని తండ్రి నుండి దూరమైపోయిన వాడెంత తప్పి పోయాడో, యింటిలో ఉన్న పెద్ద కుమారుడు కూడ అంత తప్పిపోయాడు. చిన్న కుమారుడు పాపులను సుంకరులను సూచిస్తే, పెద్ద కుమారుడు శాస్త్రులు పరిసయ్యులను సూచించు చున్నాడు. చిన్నవాడు తిరిగి వస్తే పెద్దవాని ప్రవర్తన ఎట్లున్నదో లూకా 15:25-32లో ఇప్పుడు మనం చదువు కొందము :

"అప్పుడు అతని పెద్ద కుమారుడు పొలములో ఉండెను. వాడు పొలము నుండి వచ్చుచు ఇంటిదగ్గరకు రాగా, వాద్యములను నాట్యమును జరుగుట విని, దాసులలో ఒకని పిలిచి ఇవి ఏమిటని అడుగగా ఆ దాసుడు అతనితో నీ తమ్ముడు వచ్చియున్నాడు; అతడు తన యొద్దకు సురక్షితముగా వచ్చి నందున నీ తండ్రి క్రొవ్విన దూడను వధించె ననెను. అయితే అతడు కోపపడి లోపలికి వెళ్ల నొల్లక పోయెను గనుక అతని తండ్రి వెలుపలికి వచ్చి లోపలికి రమ్మని బతిమాలుకొనెను. అందు కతడు తన తండ్రితో, ఇదిగో యిన్ని యేండ్ల నుండి నిన్ను సేవించుచున్నానే, నీ ఆజ్ఞను నేనెన్నడు మీరలేదే; అయినను నా స్నేహితులతో సంతోష పడునట్లు నీవు నా కెన్నడును ఒక మేక పిల్లనైన ఇయ్యలేదు. అయితే నీ ఆస్తిని వేశ్యలతో తిని వేసిన యీ నీ కుమారుడు రాగానే, వీనికొరకు క్రొవ్విన దూడను వధించితివని చెప్పెను. అందు కతడు కుమారుడా, నీ వెల్లప్పుడును నాతో కూడా ఉన్నావు; నావన్నియు నీవి. మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే; ఈ నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రతికెను తప్పిపోయి దొరకెనని అతనితో చెప్పెను".

చిన్న కుమారుడు దూరదేశమునకు పోయి దూర్వ్యాపారము వలన ఆస్తిని పాడు చేయుచుండగా, పెద్ద కుమారుడు పొలములో యుండి పని చేయుచు సంపాదించు చున్నట్లు మనము చూడ గలము. అతడు పొలమునుండి ఇంటిదగ్గరకు వచ్చు సరికి వాద్యములు నాట్యము జరుగుట విన్నాడు. గాని లోపలికి తానే వెళ్లి చూడడం మాని దాసులలో ఒకని పిలిచి యివేమిటని అడిగాడు. నీ తమ్ముడు వచ్చాడు. వాడు క్షేమంగా తిరిగివచ్చినందుకు నీ తండ్రి మంచి విందు చేయించుచున్నాడని అతడు సంతోషంతో జవాబిచ్చాడు. తండ్రి యొక్క సంతోషం పట్టలేనిది..... తప్పిపోయినవాడు సురక్షితంగా తిరిగి వచ్చాడు. ఈ దాసుడుకూడ యజమాని సంతోషంలో పాలు పొందుచు ఒక కుమారుని హృదయాన్ని వ్యక్తపరచాడు. గాని.......

ఇదంతటిని బట్టి పెద్ద కుమారునికి కోపము వచ్చేసింది. తన తండ్రి సంతోషంలో పాలు పొందడానికి నిరాకరించాడు; లోపలికి వెళ్లనొల్లక పోయాడు, తన తండ్రి చేసిన యేర్పాట్లను చూచి ముఖం విరుచుకొన్నాడు. గనుక అతని తండ్రి వచ్చి లోపలికి రమ్మని అతన్ని బ్రతిమలాడ వలసి వచ్చింది, అతని తమ్ముడు తిరిగి వచ్చినందున సంతోషించుటమాని కోపగించు కొన్నాడు; సరిగదా అతని హృదయంలో నిండి యున్న ద్వేషాన్ని అసూయను వ్యక్తపరచాడు.

ఇది పరిసయ్యుల మనస్తత్వాన్ని చక్కగా వ్యక్తం చేయుచున్నది. యేసు ప్రభువు పాపులతో సాంగత్యం చేయు చుంటే, వీరికి పట్టలేనంత అసూయ పుట్టేసింది. తండ్రి వచ్చి పెద్ద కుమారుని లోపలికి రమ్మని బ్రతిమలాడాడు. ఈ ఇద్దరి కుమారుల యెడల తండ్రికున్న ప్రేమ ఒకటే గాని అది వేర్వేరుగా వ్యక్తపరచబడింది. తండ్రి బ్రతిమలాడు చుండగా పెద్దవాడు, "ఇదిగో యిన్ని యేండ్లనుండి నిన్ను సేవించుచున్నానే, నీ ఆజ్ఞను నేనెన్నడు మీరలేదు; అయినను నా స్నేహితులతో సంతోష పడునట్లు నీవు నాకెన్నడును ఒక మేకపిల్లనైన ఇయ్యలేదు" అని సణుగు కొనుచు అతని స్వార్థం అంతా వెళ్ల గక్కేసాడు : నిన్ను సేవించుచున్నాను, నేనెన్నడు మీరలేదు, నా స్నేహితుడు, నా కెన్నడు అని అంతా అతని గూర్చే చెప్పుకొనుచున్నాడు. దేవాలయమునకు వెళ్లి పరిసయ్యుడు చేసిన ప్రార్థన కూడ ఈలాగేయున్నది, అంతా స్వార్థమే. పెద్ద కుమారుడు సంవత్సరముల తరబడి

సేవచేసి యుండవచ్చును గాని అతడొక కుమారుని హృదయము కలిగి ప్రేమతో సేవ చేయలేదు. కుమారుడే గాని కూలివాని స్వభావముతో సేవచేసాడు.

నీ ఆజ్ఞను నేనెన్నడు మీరలేదని తండ్రికి జ్ఞాపకంచేయుచున్నాడు. యిది కేవలం పరిసయ్యుల యొక్కయు శాస్త్రుల యొక్కయు మనస్తత్వం. కీడు నుండి దూరముగా యుండుటే గాక, మేలు చేయుటయందు ఆసక్తి కలిగి యుండుటే మంచితనము. మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును (యాకోబు 4:17). ఈ పెద్ద కుమారుడు మంచిని జరిగించుట మాని, తనను గూర్చి తాను అధికంగా అంచనా వేసుకొన్నాడు. నేనింత, అంత అని గొప్ప చెప్పుకొనడం పరిసయ్యుల అలవాటు.

'నీ ఆస్తిని వేశ్యలతో తినివేసిన యీ నీ కుమారుడు' అని చిన్న కుమారుని గూర్చి అతడు చెప్పుచున్నాడు. నా తమ్ముడు అనడం మానేసి ఈ నీ కుమారుడని చెప్పి తమ్మునితో గల తన సంబంధాన్ని త్రెంచుకొనుచున్నాడు. 'అతడు రాగానే వాని కొరకు క్రొవ్విన దూడను వధించితివని' మరల చెప్పుచున్నాడు. పెద్దవాడు అసూయ, ద్వేషము స్వనీతితో కుతకుత లాడుచుంటే తండ్రి, "కుమారుడా నీ వెల్లప్పుడు నాతో కూడనున్నావు; నావన్నియు నీవి. మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే; ఈ నీ తమ్ముడు చనిపోయి బ్రదికెను, తప్పిపోయి దొరకెనని అతనితో చెప్పాడు". అతడు నాకుమారుడైతే, నీ తమ్ముడు. రమ్ము, ఈ ఆనంద ములో పాలుపొందుమని చెప్పాడు.

ఈ పెద్ద కుమారుడెవరు? నేను కాదు అని నీ వనుకొన వచ్చును, గాని ఒకసారి ఆలోచించుకో. సంఘములో, లేదా దేవుని కుటుంబములో యుండిన ప్రతి గర్విష్టి, స్వనీతి పరుడు, సమస్యలను సృష్టించువాడు, పరుల తప్పుల నెన్నుటకు ముందుడువాడు, ఏమి చేసినా సణుగుకొనువాడు, అట్టి ప్రతి వాడు ఈ పెద్ద కుమారుడే. మరల సహోదర ప్రేమను కలిగి యుండని ప్రతివాడు, ప్రతి స్త్రీ ఈ పెద్ద కుమారుని వంటివారే. చిన్న కుమారుని పాపపు జీవితం ఆత్మను ఎంత నాశనం చేస్తాదో, సహోదర ప్రేమలేని పెద్దవాని స్వభావంకూడ అంతే నాశనం చేస్తాది.

మనం పాపపు జీవితంలో యుంటే తండ్రియైన దేవుని ప్రేమను జ్ఞాపకం చేసికొని, మారుమనస్సు నొంది ఆయన

యొద్దకు తిరిగివస్తే ఆయన తప్పక చేర్చుకొంటాడు. పాపివలె తప్పి పోయినా, కుమారుని ఘనతను మనకిస్తాడు. ఆయన చెంతనే యుంటూ గర్వాంధకారమును బట్టి తప్పిపోయినా, మనం వినయ విధేయతలు చూపిస్తే ఆయన తప్పక తన సంతోషంలోనికి ఆహ్వానిస్తాడు. నీ వెట్లున్నావు? తప్పిపోయి తిరిగి వచ్చిన వానివలె యున్నావా? ఇంటిలోనే యుంటూ తప్పిపోయిన వానివలె యున్నావా ?

- జాషువా గూటం

☆ ☆ ☆

## యేసు మరల ఎప్పుడు వచ్చుచున్నారు ?

(When will Jesus Come Again?)

యేసు ప్రభువు రెండవ రాకడ కొరకు తేదీలు నిర్ణయించువారు ఎవరో ఒకరు లేకపోలేదు. ఆయన రాకడ దినమును ప్రవచించు వారందరు అబద్ధికుల య్యారు. ఆయన రాకడ సమయాన్ని గూర్చిన సమాచారాన్ని ప్రభువు మానవుల కియ్యలేదని వారు ఎన్నడు నేర్చుకొనరా? ఆయన రాకడ సమయాన్ని గూర్చి యేసు మనకు తెలియజేయాలని అనుకొని యుంటే, అది మనకు తెలియజేయుటకు దానిని ఆయన గుర్తులతోను, అలంకార భాషలోను వర్ణించి యుండకపోవును. ఆయన రాకడ తేదీ ఏదీ ఇయ్యలేనందున దానికేదోకారణం ఉండియుండ వచ్చును. ఆ కారణమేమంటే ప్రభువును ఎదుర్కొ నుటకు సిద్ధపడకుండా ఆఖరి గడియ వరకు కనిపెట్టుట కంటే ఆయన ప్రజలు ఎల్లవేళలా ఆయనకు నమ్మకముగా యుండాలని ఆయన యొక్క కాంక్ష అయ్యున్నది.

ప్రభువు త్వరగా వచ్చుచున్నాడని అనేకులు చెబుతారు. అంటే ఆయన ఖచ్చితంగా మన జీవితకాలంలో వస్తున్నాడని వారి ఉద్దేశ్యము. అది కావచ్చును, కాకపోవచ్చును కూడ. అపొస్తలులు ఆదిమ క్రైస్తవులు కూడ ప్రభువు వారి జీవితకాంలోనే, త్వరలోనే తిరిగి వస్తారని ఎదురు చూచారు. పరలోకమందున్న తండ్రియొద్దకు ఆయన ఆరోహణుడై నప్పటినుండి క్రీస్తు ప్రభువు త్వరలో తిరిగివస్తారని ఎదురు చూచారు. పరలోకమందున్న తండ్రి యొద్దకు ఆయన ఆరోహణుడై నప్పటి నుండి క్రీస్తు ప్రభువు త్వరలో తిరిగి వస్తారని అందరు ఎదురు చూచుచునే యున్నారు. అయినను

ఆయన ఇంకా రాలేదు. అంటే ఆయన ఇంక తిరిగి రారా? కానేకాదు, గాని ఆయన మన ప్రణాళిక ప్రకారం గాక తన ప్రణాళిక ప్రకారం వస్తున్నాడని దీని భావం.

ఆయన మరల వస్తానని చెప్పి ఇంచు మించు రెండువేల సంవత్సరముల య్యింది. గనుక ఆయన త్వరలో వచ్చుచున్నాడని చెప్పుట భావ్యం కాదని కొందరు తలస్తారు. అయితే ఆయన ఈవేళ వచ్చినా లేక ఒక లక్ష సంవత్సరాల తరువాత వచ్చినా నిత్యత్వంతో పోల్చుకొంటే ఈ సమయం కొద్దిపాటిదే. గనుక యేసు త్వరలో వచ్చు చున్నాడని చెప్పుట సమంజసమే. క్రీస్తు రాకడను గూర్చి కొన్ని సంగతులు మనకు తెలుసు. దేవుని వాక్యాన్ని గౌరవించేవారు వాటితో సంతృప్తి జెందాలి.

*1. నేను మరల వత్తునని యేసు చెప్పారు:* "మీ హృదయమును కలవర పడనియ్యకుడి; దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు, నాయందును విశ్వాస ముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధ పరచ వెళ్ళుచున్నాను, నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" అని ఆయన చెప్పారు (యోహాను 14:1-3).

*2. పరలోకమందున్న తండ్రి తప్ప ఆయన రాకడ సమయమును ఎరిగిన వారెవరు లేరని మనకు తెలియజేయ బడింది:* "అయితే ఆ దినమున గూర్చి యు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోక మందలి దూతలైనను కుమారుడైనను ఎరు గరు" (మత్త 24:36).

*3. రాత్రివేళ దొంగ వచ్చినట్లు యేసు వచ్చునని చెప్పబడింది.* పేతురు యిట్లు చెప్పాడు: "అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతోలయమై పోవును" (2 పేతురు 3:10). ఆయన ఒక దొంగకాదు గాని ఎవరికి తెలియని సమయంలో ఆయన వచ్చును.

4. ప్రభువు తిరిగి వచ్చునప్పుడు భూమ్యాకాశములు గతించి పోవును (2 పేతురు 3:10). ఆయన వచ్చి భూమి మీద వెయ్యేండ్లు పాలించుననే సంగతి

యేమీలేదు. నీతిమంతులు పైకెత్తబడుట దుష్టులు భూమిమీద విడువ బడుట యను దానిని బైబిలు బోధించుట లేదు.

*5.* క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు నీతి మంతులు అనీతిమంతులు కూడ లేప బడుదురు. ఆయన ఇట్లు చెప్పారు: "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమున కును కీడుచేసినవారు తీర్పు పునరు త్థానమునకును బయటికి వచ్చె దరు" (యోహాను 5:28, 29).

*6.* ప్రభువు వచ్చుసరికి సజీవులై యున్నవారు ఆయనను ఎదుర్కొనుటకు మేఘములమీద కొనిపోబడుదురు. అపొ. పౌలు ఇట్లనుచున్నాడు: "ఆర్భాటము తోను ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగి వచ్చును. క్రీస్తు నందుండి మృతులై నవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచి యుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము" (1 థెస్స 4:16, 17).

*7.* దేవుని రాజ్యములో లేక సంఘ ములో ఆటంకములు కలుగ జేయు వారిని సమ కూర్చి నరకములో పడవేయుటకు ప్రభువు తన దూతలు పంపును. యేసు ప్రభువును ఇట్లు చెప్పారు: "మనుష్య కుమారుడు తన దూతలను పంపును, వారాయన రాజ్యములో నుండి ఆటంక ములగు సకలమైన వాటిని దుర్నీతి పరులను సమకూర్చి అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును" (మత్త 13:41, 42).

*8.* గొప్ప కడవరి తీర్పు జరుగును. "మనుష్యులొక్కసారే మృతి పొందవలె నని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును (హెబ్రీ 9:27). "ఎందు కనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందు నట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము యెదుట ప్రత్యక్షము కావల యును" (2 కొరింధీ 5:10).

*9.* తీర్పునాడు నీతిమంతులు దేవు నితో నిత్యము ఉండుట కొనిపోబడు దురు. దుర్మార్గులు నిత్య శిక్షకు గురి

యగుదురు (మత్త 25:46).

అవును క్రీస్తు మరల వచ్చు చున్నాడు. త్వరగా వచ్చున్నాడు. ఆనాడు అనేక సంగతులు జరుగును గాని అవి అనేకులు చెప్పులాగున జరుగవు. ఆయన రాకడను గూర్చి, ఆనాటి సంఘటనలను గూర్చి నీవు మోసగించబడవద్దు. అయితే ఆయన రాకడకొరకు నీవు సిద్ధపడి యున్నావా అనేది పెద్ద ప్రశ్న. లేనియెడల సమయముండగానే నీవు సిద్ధపడవలెను. యేసు నిశ్చయముగా వచ్చుచున్నాడు. ఆయన ఎప్పుడు వచ్చునో మనకు తెలియదు గాని ఆయన రాకడ తథ్యము.

✍- జె.సి.ఛోట

☆ ☆ ☆

# ఆదిమ సంఘము యొక్క పెరుగుదల

(Growth of the Early Church)

పెంతెకొస్తునాడు క్రీస్తు సంఘము ఆరంభమాయెను (అపొ.కా. 2) క్రీస్తే పునరుత్థానుడైన ప్రభువని పేతురు ప్రసంగించెను. "మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" అని అతడు ఇశ్రాయేలీ యులకు ప్రబోధించెను (అపొ.కా. 2:36). ఆ ప్రజలు తమ హృదయములో నొచ్చుకొని "సహోదరులారా, మేమేమి చేతుము" అని అడుగగా "పేతురు- మీరు మారు మనస్సు పొంది పాపక్ష మాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:37-38). ఆ దిన మందు ఇంచుమించు మూడువేల మంది బాప్తిస్మము పొందిరి(అపొ.కా. 2:41). తరువాత ఇంచు మించు ఐదువేల మంది పురుషులు చేర్చబడిరి (అపొ.కా. 4:4). మరికొంత కాలానికి పురుషు లును, స్త్రీలును అనేకులు మరి యెక్కు వగా విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి (అపొ.కా. 5:14). మరియు శిష్యుల సంఖ్య విస్తరించుచుండెను (6:7). శిష్యులు చెదరిపోక ముందు యెరూషలేములో వారు ఇంచుమించు 25 వేల మంది యుండిరి.

యెరూషలేములోని ఆదిమ సంఘము త్వరితగతిని ఎట్లు వృద్ధి జెందెనో మనం తెలిసికొనుట మంచిది. అపొస్తలుల కార్యములలోని మొదటి కొన్ని అధ్యాయముల నుండి దాని అభివృద్ధి యొక్క లక్షణములు

తెలిసికొందము.

**ఆదిమ సంఘము ఎట్లు అభివృద్ధి జెందెను ?**

*1. పట్టుదల :* "వారు ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42). వారు ఏకాగ్రత, పట్టుదల కలిగి యుండిరి. నేడు అనేక మంది సభ్యులు కొంతకాలము కనబడి మరికొంత కాలం మాయమై పోవుట వలన సంఘము అభివృద్ధి జెందుట లేదు. కొందరు కొంత కాలము మట్టుకు ఆసక్తి కలిగియుంటారు, అటు తరువాత ఆ యాసక్తిని కోల్పోతారు. నేడు సంఘాల్లో పట్టుదల కలిగిన వారవుసరం.

*2. నమ్మకత్వము :* వారు అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి. వారు అపొస్తలుల బోధయందు నమ్మకముగా నిలిచియుండిరి. పౌలు తిమోతిని ఇట్లు హెచ్చరించాడు: "నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము; వీటిలో నిలకడగా యుండుము; నీవీలాగు చేసి నిన్నును, నీ బోధ వినువారిని రక్షించుకొందువు" (1 తిమో 4:16). ఆదిమ సంఘము సత్యానికి విలువ నిచ్చెను. అపొస్తలుల బోధయందు సత్యమును బోధించినందున వారి శిష్యుల సంఖ్య విస్తరించెను.

*3. ఏకత్వము :* "విశ్వసించిన వారందరును ఏక హృదయమును ఏకాత్మయు గలవారై యుండిరి" (అపొ.కా. 4:32). శిష్యులందరు ఒకే విషయముపై ఏకత్వము కలిగి యుండిరి. ఒక స్థానిక సంఘ సభ్యులందరు ఏకాత్మయు, ఏక హృదయము గలవారై యుండిరని చెప్పుకొనుటకంటె గొప్ప ఘనత ఇంకేమున్నది? నేడు అనేక చోట్ల విభజనలు వితర్కములు కనబడుచున్నవి. అవి శరీర కార్యములు వలన కలుగుచున్నవి. అవి అసూయ, ద్వేషము, కోపము మొదలగునవి. వీటిని మనం విసర్జించి అందరు ఏకభావము, ఏక తాత్పర్యము కలిగియుండుటకు ప్రయత్నించాలి (1 కొరింధి 1:10).

*4. దాతృత్వము :* ఆదిమ శిష్యులు ఒకరి యెడల ఒకరు దాతృత్వము కలిగి యుండిరి. "ఎవడును తనకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొన లేదు; వారికి కలిగినదంతయు సమిష్టిగా ఉండెను" (అపొ.కా. 4:32). తరువాత వారికి సమయము దొరికిన కొలది వారందరికీ మేలు చేయుచుండిరి (గలతీ 6:10; 2 కొరింధి 9:13).

*5. క్రమశిక్షణ :* అననీయ సప్పీరాలు తాము పొలమును అమ్మగా పొందిన ధనమును గూర్చి అబద్ధములాడగా పరిశుద్ధాత్మ దేవుని ఉగ్రతవలన మరణించిరి (అపొ.కా. 5:1-10). "సంఘ మంతటికిని ఈ సంగతులు

వినిన వారి కందరికిని మిగుల భయము కలిగెను " (అపొ.కా. 5:11). అందువలన క్రీస్తు సంఘమంటే అందరికి భయం అని మనమనుకొన వచ్చును గాని, " స్త్రీలును పురుషులును అనేకులు మరి యెక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చ బడిరి" యని చెప్పబడినది (అపొ.కా. 5:14). దేవుని యొక్క ప్రణాళిక శ్రేష్టమైనదని మనం మరతుము. క్రమ శిక్షణ హెచ్చరిక ద్వారాను, అవుసర మయితే సహవాస బహిష్కరణ ద్వారాను ఇప్పుడు అమలు పరచబడుచున్నది (2 థెస్స 3:6). ఆదిమ సంఘములో బోధింపబడిన రీతిగ క్రమ శిక్షణను అమలు పరచడానికి తరచు మనం గొప్పగా సంశయిస్తాము. అయితే సంఘము అభివృద్ధి జెందాలంటే క్రమశిక్షణ అత్యవుసరము.

_6. దినదినము బోధ :_ "మరియు వారేకమనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడుకొనుచు, ఇంటింట విరుచుచు, దేవుని స్తుతించుచు ప్రజలందరి వలన దయపొందినవారై ఆనందముతోను, నిష్కపటముతోను ఆహారము పుచ్చు కొను చుండిరి" (అపొ.కా. 2:46). ఆదిమ శిష్యులు ప్రతి దినము దేవుని కొరకు జీవించిరి. "వారు ప్రతిదినము దేవాలయములోను ఇంటింటను మానక బోధించుచు, యేసే క్రీస్తని ప్రకటించుచుండిరి" (అపొ.కా. 5:42).

7. ప్రతిష్టత : అపొస్తలులను సమాజ మందిరము యెదటకు తీసికొని వెళ్ళిన తరువాత వారు యేసు నామమున ప్రకటించరాదని హెచ్చరింపబడిరి. వారిని కొట్టి విడుదల చేసిరి. వారు విడుదల పొంది, "ఆ నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించుచు మహాసభ నుండి వెళ్లిపోయిరని" చెప్పబడినది (అపొ.కా. 5:41). వారు ఎంతవరకు ప్రతిష్టించు కొన్నారో గదా! తరువాత పేతురు ఇట్లు హెచ్చరించాడు: "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ ననుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ నామమును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు4:16). ఆదిమ శిష్యులు యిట్టి మనస్తత్వమును కలిగియుండిరి. గనుకనే సంఘము అభివృద్ధి జెందినది.

నీవు ఆరాధన చేయుచున్న సంఘము అభివృద్ధి జెందుచున్నదా? దేవుడు తన వాక్యములో ఒక మాదిరిని మన కిచ్చియున్నాడు. ఆ మాదిరి ననుసరించుటకు మనం తీవ్రముగా ప్రయత్నించాలి.

✍ - ఏలన్ హేయర్స్

# మారుమనస్సు - దాని ప్రాముఖ్యత

(Repentance - It's Importance)

ప్రతి మానవుడు మారుమనస్సు పొందుటకు ఆసక్తి చూపవలెనని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30). ప్రతిచోట ప్రతి మానవుడు మారుమనస్సు యొక్క ప్రాముఖ్యతను గుర్తించి మారుమనస్సు పొందవలెను. ఎందుకనగా "అందరు పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). బాప్తిస్మమిచ్చు యోహాను పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని" యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను (మత్తయి 3:2). "కాలము సంపూర్ణమై యున్నది, దేవుని రాజ్యము సమీపించి యున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని" యేసుక్రీస్తు ప్రకటించెను (మార్కు 1:14-15). యేసు పంపిన 12 మంది అపొస్తలులు మనుష్యులు మారుమనస్సు పొందవలెనని ప్రకటించిరి. (మార్కు 6:12). యేసు తన అపొస్తలులకు ఇట్లు ఆజ్ఞాపించెను : మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి; "క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలో నుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సు పాప క్షమాపణ ప్రకటించబడుననియు వ్రాయబడి యున్నది అని ఆయన వారితో చెప్పెను" (లూకా 24:46-47).

## అపొస్తలుల బోధ

పెంతెకొస్తను పండుగ దినమున పరిశుద్ధాత్మ చేత నడిపింపబడుచున్న పేతురు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చి బోధించుచు అనేకులను ఒప్పించుచు మీ పాపముల నిమిత్తమై యేసు సిలువ వేయబడెనని వారికి రూఢిగా చెప్పెను. "వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా, మేమేమి చేతుమని అడుగగా; పేతురు-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము, ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి;

అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:327-38). శృంగారమను దేవాలయము వద్ద పేతురు ఇట్లనెను: "క్రీస్తు యేసును ఆయన పంపు నట్లును మీ పాపములు తుడిచివేయ బడు నిమిత్తము మారు మనస్సు నొంది తిరుగుడి" (అపొ.కా. 3:20). ప్రతి మనుష్యుడు మారుమనస్సు పొందవలెనని పౌలు చెప్పెను. మారు మనస్సు పొందనిచో తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోక మునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడని, మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసి యున్నాడని అతడు చెప్పెను (అపొ.కా. 17:30-31). "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3:9). మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు (లూకా 13:3). ఈ లేఖన భాగములను పరిశీ లించినట్లయితే ఆయా సందర్భ ములలో దేవుడు మారుమనస్సునకు ఇచ్చిన ప్రాముఖ్యత గమనించగలము. ప్రతి మనుష్యుడు ప్రతి చోట మారుమనస్సు పొందవలెననియు, మారుమనస్సు పొందకుండా ఒక మనుష్యుడు పాపక్షమాపణ సంపాదించుకో లేడ నియు యేసు క్రీస్తు తన అపొస్తలులకు ఆజ్ఞాపించెను. ప్రజలు విధేయత చూపడానికి ఇది కఠినమైన ఆజ్ఞయై యున్నది. మన దేశములో అనేకులు దేవుని కుమారుడైన యేసు నందు విశ్వాసముంచెదరుకాని తమ పాపముల నిమిత్తము మారుమనస్సు పొందువారు కొద్దిమంది మాత్రమే. ఒక వ్యక్తి దేవుడు ఏమి ఆజ్ఞాపించుచున్నాడో తెలిసికొని దానిని గైకొనడానికి తన హృదయము లలో నిశ్చయించికొన్నట్లయితే మారు మనస్సు పొందుట చాలా తేలికైన విషయము. అట్టివాడు మారు మనస్సు పొందుటయే కాదు బాప్తిస్మ మును మరి ఏ యితర ఆజ్ఞనైనను సులువుగా పాటించగలడు.

## మారుమనస్సు గూర్చి నిర్వచనములు

యేసుక్రీస్తు మరియు ఆత్మావేశపూరితులైన అపొస్తలులు మారు

మనస్సు యొక్క ప్రాముఖ్యతను గూర్చి ఎట్లు నిర్వచించిరో పరిశుద్ధ లేఖనముల నుండి చూతము. ఒక మనుష్యుడు, ఏ మనుష్యుడైనను, ఎవరైనను మారు మనస్సు తప్పక పొందవలెనని దేవుడు ఆజ్ఞాపించెను. మారుమనస్సు పొందుట మానవకోటి విధియై యున్నది. ఇది చిన్న విషయము కాదు. విచారపడుట మారు మనస్సు కాదు. ఇది సార్వజనికమైన యున్న దని దైవ లేఖనములను బట్టి గ్రహించగలము. ముప్పది వెండి నాణెములకు యేసు ప్రభువును అమ్మిన తరువాత ఇస్కరి యోతు యూదా దు:ఖ పడెను కాని మారుమనస్సు పొందలేదు. దు:ఖమునకు మారుమనస్సుకు సంబంధము కలదు. పెంతెకొస్తు దినమున జరిగిన కొన్ని సంఘటనలను గమనించెదము. 1) మీరు దుష్టుల చేత ఆయనను సిలువ వేయించి చంపితిరని పేతురు బోధించెను. 2) మీ పాపముల నిమిత్తము ఆయన దోషి ఆయెను. 3) వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని (పొడువబడి) సహోదరులారా, రక్షణ పొందుటకు మేమేమి చేతుమని అడిగిరి. 4) పేతురు పశ్చాత్తాపము పొందుట మారుమనస్సు పొందుటయే అని మాత్రము చెప్పలేదు. కాని అతడిట్లు చెప్పెను. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అపొ.కా. 2:38). "దైవ చిత్తానుసారమైన దు:ఖము రక్షణార్థమైన మారుమనస్సు కలుగజేయును. ఈ మారుమనస్సు దు:ఖమును పుట్టించదు. అయితే లోక సంబంధమైన దు:ఖము మరణమును కలుగజేయును" (2 కొరింధి 7:10).

## మారుమనస్సు ఉదాహరణలు

మత్తయి సువార్త 21వ అధ్యాయము 28-29 వచనములో యేసుక్రీస్తు మారుమనస్సును గూర్చి ఇట్లు వివరించెను: "ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. ఆతడు మొదటివాని యొద్దకు వచ్చి కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా వాడు పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. ఇక్కడ మనము ఆలోచించినట్లయితే పెద్ద కుమారుడు తనంతట తానే మనస్సు మార్చుకొనెను. యేసు రెండవ వాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు అయ్యా, పోదుననెను గాని పోలేదు". వానియొక్క సోమరి తనము మారుమనస్సు పొందని పరిస్థితి

రెండవవానియందు చూడగలము.

"నీనెవె వారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి గనుక విమర్శ సమయమున నీనెవెవారు ఈ తరము వారితో నిలువబడి వారిమీద నేర స్థాపన చేయుదురు. ఇదిగో యోనా • కంటె గొప్పవాడు ఇక్కడ ఉన్నాడు" (మత్తయి 12:41) అని యేసు చెప్పుటలోగల ఉద్దేశ మేమనగా యోనా ప్రకటన వినిన నీనెవె ప్రజలు మారుమనస్సు పొందిరి. "నీనెవె వారు తమ చెడునడతలను మానుకొనగా వారు చేయుచున్న క్రియలను దేవుడు చూచి పశ్చాత్తాప్తుడై వారికి చేయుదునని తాను మాట ఇచ్చిన కీడును చేయక మానెను" (యోనా 3:10). దుష్ట మార్గము నుండి తిరుగుటయే నిజమైన మారు మనస్సు అని యేసు చెప్పెను. "భక్తి హీనులు తమ మార్గమును విడువ వలెను. దుష్టులు తమ తలంపులను మాన వలెను. వారు యెహోవావైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలి పడును. వారు మన దేవునివైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును" (యెషయా 55:7).

మారుమనస్సు మనుష్యుని మనస్సును మార్చును. దైవ చిత్తాను సారమైన దు:ఖము మారుమనస్సు కలుగజేయును. అది నూతన జీవితముగా మార్చును. నీనెవె ప్రజలు తమ క్రియలను తాము పరిశీలించుకొని దేవునికి అనుకూలముగా తమ జీవితములను మార్చుకొనుట ద్వారా మంచిపనులను చేసిరి. వారి పశ్చాత్తాపమును దేవుడు మారుమనస్సు అనెను. మత్త 21:28-29లోని మొదటి కుమారుడు తన తండ్రి చిత్తమునకు అనుకూలముగా తన జీవితమును నిర్ణయమును, మనస్సును మార్చుకొనెను. ఇది నిజమైన మారుమనస్సు. చెడును విడిచి మంచిని పాటించెను. కనుక నీవు తడవు చేయుట ఎందుకు? మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తులోనికి ప్రవేశించి రక్షింపబడుము.

☆ ☆ ☆

✍ - బఫోర్డ్ సి. హోల్ట్

సత్యవాణి రేడియో కార్యక్రమాలను ఆది, సోమ, బుధ, గురువారల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ బంధు మిత్రులకు విన్నించండి !!

# యేసు నామము

(The Name of Jesus)

యేసు నామమును మనము వినినప్పుడు అపొ.పేతురు అపొ.కా. 3:6లో చెప్పిన మాటలు మనకు జ్ఞాపకము వస్తాయి. దేవాలయపు ద్వారము నొద్ద కూర్చొని భిక్షమడుగుకొనుచున్న ఒక కుంటి వానిని పేతురు బాగుచేసాడు. ఆ మరునాడు పేతురు యోహానులు చెరసాలలో వేయబడ్డారు. వారు ప్రధాన యాజకుని యెద్దకును, పెద్దల యొద్దకును తేబడినప్పుడు, "మీరు ఏ బలము చేత, ఏ నామమును బట్టి దీనిని చేసితిరని అడుగగా, పేతురు పరిశుద్ధాత్మతో నిండినవాడై మీరు సిలువ వేసినట్టియు, మృతులలో నుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసు నామముననే వాడు స్వస్థత పొంది మీ యెదుట నిలుచున్నాడని చెప్పెను" (అపొ.కా. 4:5-10).

ఈ లేఖన భాగాన్ని చదువునప్పుడు యేసు నామము ఎంత ఆశ్చర్యకరమైనదో, ఎంత అందమైనదో, ఎంత శక్తివంతమైనదో యని ఊహించకుండ ఉండలేకపోవుచున్నాను. కొందరు యేసు నామమును, లేక ఆయన అధికారమును ఎందుకు కించపరచుదురో నేను ఊహించలేకున్నాను. పేరులో ప్రాముఖ్యత యేమీ లేదని కొందరు వాదిస్తారు. మనము యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందు నట్లును యోహాను తన సువార్తను వ్రాసెను (యోహాను 20:30-31). గనుక యేసు నామము ద్వారానే మనకు జీవము కలుగును. దీనిలో ప్రాముఖ్యత యేమీ లేదని చెప్పె నామము కాదిది. ఆ నామములోనే మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడాలని లూకా చెప్పుచున్నాడు (లూకా 24:47). యేసు నామమే మనలను నీతిమంతు లనుగా తీర్చు నామమని అపొ.పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథి 6:11). మానవ జాతికి అంతకంటే ప్రాముఖ్య మైనది యేమున్నది?

యేసు నామము హింసలుపాలయ్యే నామమని కూడ మనము తెలిసికోవాలి. యూదుల పెద్దలు అపొస్తలులను కొట్టి విడుదలచేస్తే, "ఆ నామము కొరకు

అవమానము పొందుటకు పాత్రులని యెంచబడి నందున వారు సంతోషించుచు మహాసభ యెదుటనుండి వెళ్ళి పోయిరి" (అపొ.కా. 5:41). "మీరు నా నామమునిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు" అని ఆయన ముందుగనే వారిని హెచ్చరించెను (మత్తయి 10:22). అంతిప అను సహోదరుడు క్రీస్తు నామమును హత్తుకొని ఆయనను నిరాకరించనందున హతసాక్షి అయినట్లు కూడ మనము చదువగలము. మన విశ్వాసమును బట్టి మనకేమి సంభవించినను, మనము పొందబోయే బహుమానము యెదుట ప్రస్తుత కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని అపొ.పౌలు చెప్పుచున్నాడు (రోమా 8:18).

మనము కూడుకొంటే యేసు నామముననే కూడుకొనాలి (మత్త 18:20). ఆయన నామమును మనము దూషించరాదు (యాకోబు 2:7). సరిగదా ఆయన నామమును మహిమ పర్చాలి (కొలస్స 3:17). యేసు నామము అన్ని నామములకంటె పై నామము. ఆయన నామమున ప్రతి నాలుక ఒప్పుకొనును, ప్రతి మోకాలును వంగును (ఫిలిప్పీ 2:9-11).

ఆ నామముననే మనకు రక్షణ కలదని అపొ.కా. 4:12 చెప్పుచున్నది. యేసు నామము ప్రాముఖ్యమైనదే కాకుండా మరియే నామమున మనము రక్షణ పొందలేము. ఆయన నామమును స్తుతించుట ఎంత మంచిదో! ఆయన నామమును ధరించుట ఎంత ఘనతయో! ఆయన నామమందు భద్రము చేయబడుట ఎంత దీవెనకరమో! ఆయన నామమునకు లోబడకుండా యున్న వారికి కలుగు అవమానము ఎంత ఘోరమో! మనము ఆయన నామమును ప్రచు రించి, ఘనపరచడానికి దేవుడు సహాయ ము చేయును గాక.

✍ - కిమ్ రోపెల్

★ ★ ★

<u>గమనిక</u> : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

"సత్యవాణి కార్యక్రమ సభ్యులకు యేసు నామములో నాశుభములు. ముఖ్యంగా జాషువా గూటం గారికి నా వందనములు. మీరు చెప్పే వాక్యం చాలా......చాలా......చాల బాగుంది. అందుకనే శుక్రవారం రాత్రి నుండే మీ కార్యక్రమం చూడాలని ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూస్తువుంటాను. శనివారం మీ వాక్యం వింటేనే గాని నాకు ఆ రోజు రాత్రి నిద్రపట్టదు. నా ఆశను, బాధను అర్థం చేసుకోండి. ఆత్మీయ ఎదుగుదలకు పుస్తకాలు పంపండి".

- కె.యాకోబు, కొత్తవలస.

"ప్రియమైన జాషువా గూటంగారికి నా వందనములు. నేను 'సత్యవాణి' కార్యక్రమమును చాల ఇష్టపడతాను. ఎందుకంటే మీరు సత్యాన్ని సేకరించి ఎంతో విపులముగా అర్థమగునట్లు మాకు బోధిస్తున్నారు. అనేకమైన బోధలను వినుట చేత నా హృదయమును స్థిర పరచు కోలేని గందరగోళ స్థితిలో ఉండగా మీరు సత్యాన్ని సేకరించి బోధించుట ద్వారా ఒక అవగాహన కలిగి యున్నాను. మీరు టి.వి.లో ప్రకటించుచున్న పుస్తకములు చదివి మరింత నిజాన్ని తెలిసికోవాలని నా ఆశ. మీకు నా హృదయ పూర్వక వందనములు".

- టి. శిరీష, వేకనూరు, కృష్ణాజిల్లా.

"క్రీస్తు నందు మిక్కలి ప్రియులైన 'సత్యవాణి' సువార్త సేవా బృంద మునకు ఆ యేసు ప్రభువు దివ్యనామమును శుభములు కలుగును గాక! అయ్యా నేను హిందువుణ్ణి. దయతో మా కొరకు, పిల్లల కొరకు, మేము పూర్తిగా ప్రభువునకు విధేయులగుట కొరకు ప్రార్థించ మనవి".

- ఎ. ఎల్. రెడ్డి, విశాఖపట్టణం.

ప్రభువు నందు ప్రియులు జాషువా గూటం గారికి వందనములతో వ్రాయుట : అయ్యా, మేము మా ప్రాంతముల క్రైస్తవులు తేజ టి.వి.లో 'సత్యవాణి' కార్యక్రమాలు చూస్తు, మాకు యింత వరకు తెలియని సత్యాలు కండ్లార చూచి, చెవులార విని పూర్వములో యున్న పద్ధతులకు స్వస్తి చెబుతున్నాము. అట్లాగని అనేకులు కూడ చెబుతున్నారు. ఈ కార్యక్రమ ములు ప్రభువు రెండవ రాకడ వరకు కొనసాగాలని ప్రార్థించుచున్నాము. మా ప్రాంతములో అబద్ధ బోధకులు, కలిపి చెరిపేవారు ఎక్కువగా యున్నారు. వారి యొక్క బోధలు దిన దినం ఖండించుచు ముందుకు సాగు చున్నాము. మీ దయవల్ల దైవ కృప వల్ల ఈ సత్యం మీరు మాకు నేర్పుచున్న లేఖన భాగములను బట్టి మీకు వందనములు".

- ఎమ్.ఎల్. కృష్ణాఫర్, జొన్నలగరువు, ప॥గో॥జిల్లా.

'సత్యవాణి' వారికి క్రీస్తు పేరట శుభములు. 18-10-2003 శనివారం నాడు జాన్ రిక్కీగూటం, (MBA, USA) గారు అందించిన వాక్యవివరణ అద్భుతం! దేవుడున్నాడని తెలుపుటకు వారి చేతి గడియారమును ఉదాహరణ చూపుతు సూర్యుడు చంద్రుడు మానవుని యొక్క డిజైలను ఉపయోగించిన విధానం అమోఘం. దేవుడున్నాడు, ఆయనే యెహోవా అని బైబిలు గ్రంథం నుండి తేటగా 'తేజాలో' అందించినందుకు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు. రాబోయే తరాలకు కావలసిన వర్తమానికుణ్ణి జాషువా గారు యుక్తకాలంలో అందించి నందులకై ఆంధ్ర (తెలుగు) క్రైస్తవలోకం ఎంతగానో ఋణ పడి ఉంటుంది. B.Tech. ఆఖరి సంవత్సరం చదువుతూ దేవుని పరిచర్యలో ఆశక్తిగా పాల్గొనుచున్న రాబిన్ గారికి కృతజ్ఞులు. మహాఘనుడు మరింతగా మీ దీన కుటుంబమును దీవించాలని అను నిత్యం మా ప్రార్థన".

- కె. సుగుణాకర్, మండపేట, తూ॥గో॥జిల్లా.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.